జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 28-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 767 పేజీలు: 4 వెల: రూ.7



# కాలువను కప్పేసి.. భవన నిర్మాణం

* అనుమతుల్లేకుండా కట్టడాలు * కాలువ ఆక్రమణపై నిలదీసిన స్థానికులు * అంతా నా ఇష్టం అంటున్న నిర్మాణదారుడు * రోడ్డుపై నిలిచిపోతున్న మురుగునీరు * మున్సిపల్ అధికారులకు నిబంధనలు వర్తించవా అంటూ స్థానికుల ప్రశ్న * కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన గుడివీధివాసులు

శ్రీకాకుళం, ఆగస్టు 27 (వార్త): శ్రీకాకుళం పట్టణంలో గుడి వీధి ఎంట్రన్స్‌లో పట్నాల సుబ్బయ్య మెడికల్ షాప్‌కు ముందు భాగంలో పట్నాల పద్మనాభం అనే వ్యక్తి కాలువను కప్పేసి భవన నిర్మాణం చేపడుతున్నాడు. మున్సిపల్ సీసీ రోడ్డుకు ఆనుకుని ఉన్న తన పాతభవనాన్ని కొట్టేసి కొత్తగా నిర్మాణం చేస్తున్నాడు. స్థలానికి ఆనుకుని పడమర భాగంలో మున్సిపాలిటీకి చెందిన సీసీ రోడ్డు కాలువ ఉంది. ఆ కాలువను పూర్తిగా తొలగించేశాడు. ఐదు అడుగులు పాటు తన స్థలంలో కలిపేసి భవన నిర్మాణం చేపడుతున్నాడు. అయితే ఆ భవన నిర్మాణానికి మున్సిపాలిటీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోలేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణదారుడు సోదరుడు గతంలో శ్రీకాకుళం మున్సిపాలిటీలో ఉద్యోగం చేస్తూ ప్రస్తుతం బదిలీపై పాలకొండ మేజర్ పంచాయతీ విభాగంలో పనిచేస్తున్నాడు. అతని అండదండలతో భవన నిర్మాణదారుడు వేకెన్సీ సైట్‌కి టాక్స్ చెల్లించకుండా, ఇంటికి ప్లాన్ గాని, మున్సిపాలిటీ వారి అనుమతి లేకుండా రాత్రి, పగలు తేడా లేకుండా ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. అయితే కాలువను ఆక్రమించేయడంతో మురుగునీరు దిగువకు వెళ్లకుండా రోడ్డుపైకి వచ్చేస్తోంది. దీంతో దోమల బెడద






తీవ్రంగా ఉంది. ఇదే విషయమై గుడివీధివాసులు.. భవన నిర్మాణదారుడిని నిలదీశారు. మున్సిపల్ అధికారుల అండదండలు ఉన్నాయని, తనను ఎవరేం చేయలేరని ప్రగల్భాలు పలుకుతుండడంతో పాటు ప్రశ్నించిన వారిపై మండిపడుతున్నాడు. దీంతో గుడివీధివాసులు కొందరు ఈ అక్రమ నిర్మాణం, కాలువ ఆక్రమణ విషయమై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమయ్యారు. గురువారం కాలనీవాసులు కొందరు నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

# శాలిహుండంలో.. ఇసుక అక్రమ ర్యాంపు



* ఇష్టారాజ్యంగా వంశధార నదిలో తవ్వకాలకు సిద్ధం * భారీ లారీల్లో ఇసుక తరలింపుతో సీసీ రోడ్లు ధ్వంసమవుతాయంటున్న స్థానికులు * సీఎం ఆర్డర్ల పేరుతో బెదిరింపులు * పోరాటానికి సిద్ధమైన రైతులు * జలవనరుల శాఖకు రూ. 50వేలు ముట్టజెప్పినట్లు చెబుతున్న ర్యాంపు నిర్వాహకులు * పీసీబీ ఎన్‌ఓసీ కోసం కూడా ముడుపులు * త్వరలోనే ర్యాంప్ ప్రారంభమనే ప్రచారం

గార/శ్రీకాకుళం, ఆగస్టు 27 (వార్త): ప్రపంచ ప్రఖ్యాత చారిత్రక, పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతున్న శాలిహుండం (శ్వేతపర్వతం) మనుగడ నేడు తీవ్ర ప్రమాదంలో పడింది. శాలిహుండం గ్రామాన్ని ఆనుకుని ప్రవహించే జీవనది వంశధార నదీతీరాన, బౌద్ధ ఆరామాలు వెలసిన ఈ పవిత్ర నేలపై ఇసుక మాఫియా పంజా విసురుతోంది. గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో శాలిహుండంలో ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ప్రయత్నించగా, బోర్ బావులు ఎండిపోయి తాగు, సాగునీటి ముప్పు వాటిల్లుతుందని రైతులు అడ్డుకున్నారు. అప్పట్లో భూగర్భ జల శాఖ అధికారులు సైతం దీనిని పరిశీలించి ర్యాంపును నిలిపివేశారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాగానే అధికార పార్టీ నేతలు మరింత రెచ్చిపోయి, "మాదే ప్రభుత్వం" అంటూ నిబంధనలను కాలరాస్తూ, వారసత్వ సంపదను నాశనం చేసేలా కొందరు దౌర్జన్యంగా అక్రమ ఇసుక ర్యాంపు పనులను తెరపైకి తెస్తున్నారు. దీనివల్ల ఈ చారిత్రక ప్రాంతం తన వైభవాన్ని కోల్పోయి పూర్తిగా ధ్వంసమయ్యే దుస్థితి ఏర్పడుతోందని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శాలిహుండం గ్రామంలో ఇసుక ర్యాంపు ఏర్పాటు వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తోంది.

## తరతరాల దళిత భూముల ఆక్రమణ.. 1971 నాటి డీ-పట్టాలపై నీలి నీడలు

ఈ ఇసుక తవ్వకాల కోసం దళిత రైతుల జీవనాధారమైన భూములను ఆక్రమించేందుకు యత్నిస్తుండటం గమనార్హం. గత వంద సంవత్సరాలుగా కొబ్బరి తోటలు సాగు చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేద దళిత కుటుంబాలకు 1971లోనే ప్రభుత్వం డీ-పట్టాలు మంజూరు చేసింది. అయినప్పటికీ, "ఇవి ప్రభుత్వ భూములు, మీకు ఎలాంటి హక్కులు లేవు" అని బెదిరిస్తూ కూటమి నేతలు ట్రాక్టర్లు, పొక్లెయిన్లతో ఆ భూముల్లోకి చొరబడి దౌర్జన్యంగా రోడ్లు నిర్మిస్తున్నారు. అంతేకాకుండా, గ్రామంలో శివాలయం వద్ద ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం మూడు నెలల కిందటే వేసిన నూతన సీసీ రోడ్డుపై 60 టన్నుల భారీ ఇసుక లారీలను తిప్పేందుకు ప్లాన్ చేస్తుండటంతో, ఆ రోడ్డు ఎక్కడ ధ్వంసమైపోతుందోనని గ్రామస్థులంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

## సీఎం ఆర్డర్లంటూ బెదిరింపులు

"మాకు నేరుగా ముఖ్యమంత్రి (సీఎం) స్థాయి నుంచే ఆర్డర్లు వచ్చాయి" అని చెబుతూ స్థానిక నేతలు దౌర్జన్యానికి దిగుతుండటంపై గ్రామ రైతాంగం మండిపడుతోంది. మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ చింతల గడ్డయ్య నాయకత్వంలో బాధితులైన దళిత రైతులందరూ ఒకటై ఈ అక్రమాలపై సంతకాల సేకరణ చేపట్టారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి భూగర్భ జలాలను, తమ పట్టా భూములను, ఊరి సీసీ రోడ్డును కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించి, ఫోటోలు, వీడియో ఆధారాలతో ప్రెస్ మీట్ నిర్వహించి పెద్ద ఎత్తున న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

## జలవనరుల శాఖకు రూ. 50,000 ముడుపులు.. నిజమేనా?

ఈ వ్యవహారంలో మరో సంచలన నిజం వెలుగులోకి వచ్చింది. ర్యాంపు కోసం ఇప్పటికే జలవనరుల శాఖకు రూ. 50,000 చెల్లించామని, అందుకే తమకు అనుమతులు వచ్చేశాయని ర్యాంపు నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు. అంతేకాకుండా, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఎన్‌ఓసీ కోసం కూడా ముందే డబ్బులు ఇచ్చేసామని, త్వరలోనే ర్యాంపును పూర్తిగా ప్రారంభించేస్తామని వారు ప్రచారం చేస్తున్నారు. అయితే, ప్రతి ర్యాంపు కోసం జలవనరుల శాఖ నిజంగానే రూ. 50,000 చొప్పున వసూలు చేస్తున్నట్లు తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూగర్భ శాఖ దీనికి నాలుగు రెట్లు వసూలు చేస్తూ తాము ఏమి తక్కువ కాదు అన్నట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలూ ఉన్నాయి.

**ఈ అక్రమ వసూళ్లు.. అసలు నిజానిజాలపై మరో ప్రత్యేక కథనంలో మరిన్ని వివరాలతో కలుద్దాం.**

# డిపో మేనేజర్‌నంటూ యువకుడి హల్‌చల్

* కొత్తూరు వెళ్లేందుకు బస్సులో సీటు ఉంచాలని ఆర్టీసీ అధికారులకు హుకుం * అతని తీరుపై అధికారులకు అనుమానం * పోలీసులకు అప్పగింత * బస్సులో సీటు కోసం నాటకం



శ్రీకాకుళం, ఆగస్టు 27 (వార్త): విశాఖపట్నంలోని చినవాల్తేరుకు చెందిన బోరాడ శ్రీనివాసరావ బుధవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సుకు వచ్చాడు. తాను ఏలూరు డిపో మేనేజర్‌నని, కొత్తూరు వెళ్లే బస్సులో తనకు ఓ సీటు ఉంచాలని ఆర్టీసీ ఉద్యోగులకు హుకుం జారీ చేశాడు. అతని తీరుపై అనుమానం రావడంతో సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. బస్టాండ్, డిపో మేనేజర్లు ప్రసాదరావు, పి.సంతోష్‌కుమార్ అక్కడికి చేరుకున్నారు. గుర్తింపు కార్డు, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను 2019 బ్యాచ్‌కు చెందిన అధికారిగా పరిచయం చేసుకుని నమ్మించే ప్రయత్నం చేశాడు. గుర్తింపు కార్డు చూపించాలని ఆర్టీసీ అధికారులు నిలదీయడంతో అతని బండారం బయటపడింది. వెంటనే రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసరావు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీటెక్ చదువుతున్నాడు. బస్సులో సీటు దొరక్కపోవడంతో ఈ నాటకం ఆడినట్టు తెలిసింది.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ఆక్రమణలకు అడ్డుకట్టేదీ?

-యథేచ్ఛగా కబ్జాలు చేస్తున్న అక్రమార్కులు

-పట్టించుకోని రెవెన్యూ అధికారులు

-స్పష్టంగా కనిపిస్తున్న నిర్లక్ష్యం

-రెవెన్యూ సిబ్బందిపై స్థానికుల విమర్శలు

-తహసీల్దార్ పరిశీలించినా చర్యలు శూన్యం!




**సంతబొమ్మాళి, ఆగస్టు 27 (వార్త):** సంతబొమ్మాళి మండలంలో రెవెన్యూ సిబ్బంది వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములు, గ్రామ కంఠాలు, చెరువులు ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్రమణలపై పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ, వాటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు సమస్యను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ యంత్రాంగంలోని కొందరు సిబ్బంది ఆక్రమణదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో పాత రికార్డులను పక్కనపెట్టి, కొత్తగా రికార్డులు సృష్టించడం, సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు లేకపోయినా ఖాతా నంబర్లు, పాస్‌బుక్కులు మంజూరు చేయడం వంటి అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ లేకుండా, సరైన ఖాతా నంబరు లేకుండా భూములకు రెవెన్యూ రికార్డుల్లో మార్పులు ఎలా జరుగుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ భూములు, చెరువులు, గ్రామ కంఠాలు అన్యాక్రాంతమవుతున్న సమయంలో అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండల రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది సొంత మండలానికి చెందినవారు కావడంతో స్థానిక వ్యవహారాలపై వారికి పూర్తి అవగాహన ఉండటంతో పాటు, వారి ప్రభావం కూడా ఎక్కువగా ఉంటోందని, దీంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములు, గ్రామ కంఠాలు, చెరువులు తదితర ప్రభుత్వ ఆస్తుల విషయంలో నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సిన అధికారులు స్థానిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. గతంలో సంతబొమ్మాళి మండలంలో హనుమంతు నాయుడుపేట, నౌపడ, నౌపడ ఆర్ ఎస్ రైల్వే గేటు ధరి తోపాటు పలు గ్రామాలలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయంటూ పత్రికల్లో కథనాలు ప్రచురితమైన సందర్భాల్లో సంబంధిత తహసీల్దార్ స్వయంగా ఆయా ప్రాంతాలను పరిశీలించినట్లు సమాచారం. అయితే పరిశీలన జరిగి చాలాకాలం గడుస్తున్నప్పటికీ, ఆక్రమణలపై ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడంపై స్థానికుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తహసీల్దార్ స్థాయి అధికారి స్వయంగా పరిశీలించిన తర్వాత కూడా ఆక్రమణలు తొలగించకపోవడానికి కారణం ఏమిటి? విచారణలో ఏం తేలింది? బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? అనే ప్రశ్నలకు రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. పత్రికల్లో ఆక్రమణలకు సంబంధించిన కథనాలు వచ్చిన తర్వాత వాటిపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అధికారులు, సమస్యను పరిష్కరించకుండా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

రెవెన్యూ రికార్డుల్లో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో సంతబొమ్మాళి మండలంలోని ప్రభుత్వ భూములు, గ్రామ కంఠాలు, చెరువులు, ఇతర ప్రభుత్వ ఆస్తులపై సమగ్ర స్థాయి విచారణ నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ప్రత్యేకంగా గత కొన్నేళ్లలో ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డుల్లో జరిగిన మార్పులు, పాస్‌బుక్కుల జారీ, ఖాతా నంబర్ల కేటాయింపు, అడంగల్--1బీ నమోదులు, భూముల బదలాయింపులపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో స్థాయి అధికారులు సంతబొమ్మాళి మండలంలోని రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ భూములు, చెరువులు, గ్రామ కంఠాల హద్దులను పునఃపరిశీలించి వాటిని ఆక్రమణల నుంచి రక్షించాలని కోరుతున్నారు.

## వృక్షాబంధనంతో పర్యావరణానికి మేలు

- డాక్టర్ యారాడి కృష్ణమూర్తి



**సోంపేట, ఆగస్టు 27 (వార్త):** వృక్షాబంధనం చేపట్టడం వలన చెట్లకు హాని కలక్కుండా మేలు జరుగుతుందని తద్వారా పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని సోంపేట పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ యారాడి కృష్ణమూర్తి అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా గత మూడు రోజులుగా సోంపేట తో పాటు వివిధ గ్రామాలలో పర్యావరణ సంఘం సభ్యులు మహిళలతో కలిసి పవిత్రంగా భావించే మర్రి,రావి,వేప తదితర చెట్లకు రక్షాబంధన్ కట్టే కార్యక్రమాన్ని విరివిగా చేపడుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజలకు మరింత అవగాహన కలుగుతుందని అన్నారు. చెట్లకు ఎటువంటి హాని లేకుండా కాపాడుకోవాలన్న స్పృహ ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు. మనిషి కన్నా ఎక్కువ విలువ ఇస్తూ వృక్షాలను కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో చెట్లు, మొక్కల యొక్క పాత్ర ఎంతో కీలకమైనదని అన్నారు. కంటికి రెప్పలా వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. గురువారం పల్లిగొల్లగండి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో తెప్పల కోదండరావు, వైశ్యరాజు నాగు, బార్ల సుందర రావు, మహిళలు పాల్గొన్నారు.

# ఆస్పత్రి కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన



**ఇచ్ఛాపురం, ఆగస్టు 27 (వార్త):** ఇచ్ఛాపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఉదయం వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీ ధరించి తమ నిరసన వ్యక్తం చేస్తూనే, రోగులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బాధ్యతాయుతంగా వైదయ సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఆసుపత్రిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన సేవలందిస్తున్నప్పటికీ ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని, తమ సర్వీసులను క్రమబద్ధీకరించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కారించాలని కోరుతూ సూపరెండెంట్ డాక్టర్ పి.దేవేంధర్ రెడ్డికి వినత పత్రం అందజేశారు.

వైద్య సేవలకు ఎటువంటి విఘాతం కలగకుండా శాంతియుతంగా విధులకు హాజరవుతూనే తమ నిరసన తెలియజేస్తామని అన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు ఎం.జగదీశ్వరి, ఎన్.జయలక్ష్మి, షమీనా ఎండీ, ఎల్.సంధ్యలు పాల్గొన్నారు.

# చీపి ఆశ్రమ విద్యార్థులకు కంటి పరీక్షలు



**మందస, ఆగస్టు 27(వార్త):** మందస మండలంలో సాబకోట పంచాయతీ బుడంబోకాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల చీపి గ్రామంలోని గిరిజన ఆశ్రమ బాలురు పాఠశాలలో గురువారం ఉచిత కంటి పరీక్షా వైద్య శిబిరం జరిగింది. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 60మంది విద్యార్థులకు మందస మండల నేత్ర వైద్య సహాయ అధికారి రోణంకి వెంకటరమణ కంటి పరీక్షలు నిర్వహించారు. ఇద్దరు విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించి, వారికి కళ్ల అద్దాలకు సిఫార్సు చేశారు. కంటి వ్యాధులు, నేత్ర సంరక్షణపై పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా మొబైల్ ఫోన్ అతిగా వినియోగించడం వలన కలిగే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సురేందర్, ఉపాధ్యాయులు ఎస్.రామారావు, జి.సత్యన్నారాయణ, వి.రాము, పి.రామక్రిష్ణ, ఆశావర్కర్లు కుమారి, ద్రౌపతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# సొండిపూడి జడ్పీహెచ్ఎస్‌లో చెకుముకి పరీక్షలు

**మందస, ఆగస్టు 27(వార్త):** మందస మండలం లోని సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం పాఠశాల స్థాయి చెకుముకి పరీక్షల నిర్వహణ జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నగిరి కరుణాకర్ ప్రశ్నపత్రాలను విడుదల చేస్తూ.. పిల్లలలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి ఇటువంటి పరీక్షలు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు పి.చంద్రశేఖర్, ఎస్.నారాయణరావు, నగరి. అరుణ్ కుమార్, ఎస్.విజయ్, చంటిబాబు, కె.వెంకటరమణ పాల్గొన్నారు.




# బ్యాంక్ ఉద్యోగుల నిరసన ప్రదర్శన



**ఇచ్ఛాపురం, ఆగస్టు 27 (వార్త):** యునైటెడ్ బ్యాంక్ ఫోరమ్ పిలుపు మేరకు వి కే పేట స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ వద్ద గురువారం సాయంత్రం సిబ్బంది అధికారులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. స్కేల్ 3, దిగువ ఉన్న బ్యాంక్ ఉద్యోగులు కి న్యాయ పరమైన పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు బ్యాంక్ లో ఉద్యోగుల అందరికీ ఒకే రీతిలో అందించాలని డిమాండ్ చేశారు. 5 రోజుల బ్యాంకింగ్ పనిదినాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన లో భాగంగా సెప్టెంబర్ 11 న సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమంలో పంజావీధి ,శిలగం బ్రాంచ్ సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ మేనేజర్ ధనంజయ రావు,ఫీల్డ్ ఆఫీసర్ నాగరాజు, లోకల్ సెక్రటరీ లు పిట్ట శంకర్ రెడ్డి, దట్టి సంతోష్ కుమార్,సాహుకరి రాజేశ్, సమదర్శి, కాతిల ప్రసాద్ రెడ్డి, కుండల రాజేశ్, సాయి సింధు, గౌరీ శంకర్, మురకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

### నరసన్నపేటలో ఘనంగా బీజేపీ ..

# నియోజకవర్గ కార్యాలయం ప్రారంభం

- బీజేపీ జెండాను ఆవిష్కరించిన జిల్లా, రాష్ట్ర నాయకులు
- పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నేతల వెల్లడి



**నరసన్నపేట, ఆగస్టు 27 (వార్త):** నరసన్నపేటలో భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ నూతన కార్యాలయాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నరసన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, బీఎల్ఏ-1 పోకతోట సింహాచలం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎచ్చెర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే నడికుండి ఈశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు.

అనంతరం జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరై నూతన కార్యాలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నడికుండి ఈశ్వరరావు మాట్లాడుతూ నరసన్నపేట ప్రాంతంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసి, సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు నూతన కార్యాలయం ఉపయోగపడుతుందని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు మాట్లాడుతూ నరసన్నపేట నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, జిల్లా ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, మాజీ జిల్లా అధ్యక్షుడు అట్టాడ రవి బాబ్జి, టీడీపీ నాయకురాలు బగ్గు అర్చన, జనసేన నాయకుడు మెట్ట వైకుంఠరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు చింతు పాపారావు, పేడాడ స్వరూప నాయుడు తదితరులు పాల్గొన్నారు. నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, మండల స్థాయి నాయకులు, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నూతన కార్యాలయం ప్రారంభంతో నరసన్నపేట ప్రాంతంలో పార్టీ కార్యకలాపాలకు మరింత ఊపందుకుంటుందని నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇచ్ఛాపురంలో ఐటీఐని ఏర్పాటు చేయండి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 27 (వార్త):** కోటబొమ్మాళి టీడీపీ కార్యాలయంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ని రాష్ట్ర బి.సి. రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ కొండా శంకర్ రెడ్డి కలిసి ఘనంగా సత్కరించారు. రెడ్డిక కార్పొరేషన్‌కు వెంటనే డైరెక్టర్లను నియమించాలని, నిరుపేద రెడ్డిక కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని, ప్రత్యేకంగా "రెడ్డిక రెసిడెన్షియల్ పాఠశాలలు" ఏర్పాటు చేయాలని,నిరుద్యోగ యువతకు రైతులకు పనిముట్లకు బీసీ సబ్సిడీ రుణాలు ఇవ్వాలని,ప్రతి మండలంలో ప్రత్యేక "సామాజిక భవనాలు" నిర్మించాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో ఐటీఐ సంస్థను మంజూరు చేయాలని, వలసలు అరికట్టేందుకు స్థానికంగా పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు.. ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ధూపాన రమణ రెడ్డి , కృష్ణ రెడ్డి , మాజీ సర్పంచ్ స్వరూప్ రెడ్డి (సంతబొమ్మాళి మండల పార్టీ టీడీపీ అధ్యక్షుడు) తదితరులు పాల్గొన్నారు.



## సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకు చెకుముకి ప్రతిభా పరీక్షలు

- లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పరీక్షల నిర్వహణ
- 8, 9, 10వ తరగతి విద్యార్థుల ఉత్సాహభరిత భాగస్వామ్యం
- శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే పరీక్షల ప్రధాన లక్ష్యం

**జలుమూరు, ఆగస్టు 27 (వార్త):** విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలను నిర్వహించినట్లు లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గన్నెమ్మ, సైన్స్ ఉపాధ్యాయులు బమ్మిడి శ్రీనివాసరావు, స్వాతి తెలిపారు. జలుమూరు మండలం లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయిలో ఈ పరీక్షలు నిర్వహించారు. 8వ, 9వ, 10వ తరగతులకు చెందిన విద్యార్థులు పరీక్షల్లో ఆసక్తిగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. సైన్స్‌కు సంబంధించిన వివిధ అంశాలపై విద్యార్థుల అవగాహనను పరీక్షించడంతో పాటు, వారిలో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేలా ప్రశ్నలను రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా పరిశీలన, విశ్లేషణ, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించడంలో ఇటువంటి సైన్స్ ప్రతిభా పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు సైన్స్ రంగంపై మరింత ఆసక్తి కనబరిచి తమ ప్రతిభను వివిధ స్థాయిల్లో ప్రదర్శించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు పాల్గొని పరీక్షల నిర్వహణలో సహకరించారు. పరీక్షల్లో విద్యార్థులు చూపిన ఉత్సాహం ఉపాధ్యాయులను ఆకట్టుకుంది.





## డీసీసీ నూతన కార్యవర్గ జాబితా విడుదల

- ఏఐసీసీ, పీసీసీ ఆమోదంతో జిల్లా కాంగ్రెస్ కమిటీ కొత్త కార్యవర్గం ప్రకటన
- గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యమన్న డీసీసీ అధ్యక్షుడు
- రానున్న స్థానిక ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే దిశగా కార్యాచరణ

**శ్రీకాకుళం, ఆగస్టు 27 (వార్త):** ఏఐసీసీ, పీసీసీ ఆమోదంతో రూపొందించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గం జాబితాను డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీ రావు శుక్రవారం విడుదల చేశారు. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకుల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గం జాబితాను ప్రకటించారు. నూతన కార్యవర్గంలో జిల్లాలోని సీనియర్ నాయకులు, రాజకీయ అనుభవజ్ఞులు, పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్న ముఖ్య నాయకులకు స్థానం కల్పించినట్లు అన్నాజీ రావు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు అన్ని వర్గాల నాయకులను సమన్వయం చేసుకుని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో కార్యవర్గాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా ఏఐసీసీ, పీసీసీ ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. మండల, గ్రామస్థాయి కార్యకర్తలకు మరింత ప్రాధాన్యత కల్పిస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన భూమిక పోషించేలా ఇప్పటి నుంచే అడుగులు వేస్తున్నట్లు చెప్పారు.

జిల్లా కమిటీలోని ప్రతి ఒక్కరి సహకారంతో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చూడడమే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి నరసింహమూర్తి, కరిమజ్జి మల్లేశ్వరరావు, రెల్ల సురేష్, కేవీఎల్ఎస్ ఈశ్వరి, దేశెల్ల గోవిందమల్లిబాబు, బొచ్చ కృష్ణవేణి, బస్వా షణ్ముఖరావు, ఆబోతుల వెంకటనాయుడు, మామిడి సత్యనారాయణ, ఇజ్జురోతు రమణ, కూరాకుల వెంకటరావు, చాన్ బాషా, సాయిదుల్లా ఖాన్, పూడి కిరణ్‌కుమార్, బేరి వెంకట్రావు, గొంటి రామారావు, రాగోలు నాగశివ, కోడూరు విజయ్‌కుమార్, నేతల ఆదినారాయణ, సోడవరం చంద్రశేఖర్, సీతారెడ్డి, ముల్లు రమణ, ఎం. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో రెవెన్యూ గ్రామ చావడి

- దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం నిర్వహణ లేక శిథిలావస్థకు
- మండల వ్యవస్థ ఏర్పాటుతో మూతపడిన రెవెన్యూ కార్యాలయ కేంద్రం
- పునరుద్ధరించి ప్రజోపయోగానికి తీసుకురావాలని స్థానికుల విజ్ఞప్తి

**నరసన్నపేట, ఆగస్టు 27 (వార్త):** నరసన్నపేట ప్రధాన రహదారిలో ఉన్న పాత రెవెన్యూ గ్రామ చావడి కేంద్రం నిర్వహణకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థలో ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాలూకా వ్యవస్థ అమలులో ఉన్న సమయంలో రెవెన్యూ పరిపాలనా కార్యకలాపాల కోసం ఈ గ్రామ చావడి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో ఇక్కడ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) స్థాయి అధికారి విధులు నిర్వహిస్తూ స్థానిక రెవెన్యూ వ్యవహారాలను పర్యవేక్షించేవారని స్థానికులు చెబుతున్నారు. ఈ కేంద్రం ద్వారా పరిసర ప్రాంతాల ప్రజలకు వివిధ రెవెన్యూ సేవలు అందుబాటులో ఉండేవని తెలిపారు. అనంతరం మండల వ్యవస్థ ఏర్పడడంతో పరిపాలనా విధానంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో ఈ కేంద్రం ప్రాధాన్యం కోల్పోయి క్రమంగా పూర్తిగా మూతపడింది. అప్పటి నుంచి భవనం నిర్వహణ లేకపోవడంతో కాలక్రమేణా గోడలు దెబ్బతిని, పైకప్పు కూడా శిథిలావస్థకు చేరినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. నరసన్నపేట ప్రధాన రహదారిపై ఉండటంతో ఈ పాత భవనం చారిత్రకంగా కూడా ప్రాధాన్యత కలిగి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. భవనాన్ని పునరుద్ధరించి రెవెన్యూ శాఖకు సంబంధించిన కార్యాలయ అవసరాలకో, ఇతర ప్రజోపయోగ కార్యక్రమాలకో వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

- కీర్తి, లక్ష్మీప్రియలకు రాష్ట్రస్థాయి పోటీల్లో అవకాశం
- శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ
- సెప్టెంబర్ 10 నుంచి 14 వరకు అనంతపురంలో పోటీలు

**పోలాకి, ఆగస్టు 27 (వార్త):** ఈదులవలస పీఎం శ్రీ మోడల్ కళాశాలకు చెందిన విద్యార్థినులు సాఫ్ట్‌బాల్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు కీర్తి, లక్ష్మీప్రియలను కళాశాల ప్రిన్సిపల్ పైడి ప్రవీణ గురువారం అభినందించారు. శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఈదులవలస పీఎం శ్రీ మోడల్ కళాశాలకు చెందిన కీర్తి, లక్ష్మీప్రియ సాఫ్ట్‌బాల్ విభాగంలో తమ ప్రతిభను చాటుకుని తదుపరి స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. వీరు సెప్టెంబర్ 10 నుంచి 14వ తేదీ వరకు అనంతపురంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి వేదికపై కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ప్రిన్సిపల్ పైడి ప్రవీణ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కీర్తి, లక్ష్మీప్రియలకు కళాశాల తరఫున అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. విద్యార్థినుల విజయంపై కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ వారికి అభినందనలు తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ప్రాయోగిక జ్ఞానం, నైపుణ్యాల అభివృద్ధికి

# విద్యార్థుల పారిశ్రామిక సందర్శన




**ప్రాయోగిక జ్ఞానం, నైపుణ్యాల అభివృద్ధికి విద్యార్థుల పారిశ్రామిక సందర్శన**

**- లింగాలవలస సబ్‌స్టేషన్‌ను సందర్శించిన ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ విద్యార్థులు**

**- చల్లవానిపేట కంప్యూటర్ సెంటర్‌లో ఐటీ విద్యార్థుల ప్రాయోగిక అధ్యయనం**

**- విద్యార్థుల సాంకేతిక, వృత్తిపరమైన నైపుణ్యాల పెంపొందింపే లక్ష్యం : ప్రిన్సిపాల్ శివకుమార్**

**జలుమూరు, ఆగస్టు 27 (వార్త):** కరవంజలోని పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు వృత్తి విద్యలో భాగంగా విద్యార్థులకు ప్రాయోగిక జ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు పారిశ్రామిక సందర్శన కార్యక్రమం నిర్వహించారు. పాఠ్యాంశాలను కేవలం తరగతి గది బోధనకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ విభాగం విద్యార్థులు లింగాలవలస సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. అక్కడ విద్యుత్ సరఫరా వ్యవస్థ, సబ్‌స్టేషన్ నిర్వహణ విధానం, వివిధ ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరు, భద్రతా చర్యలు తదితర అంశాలను



పరిశీలించి అవగాహన పొందారు. విద్యుత్ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం ఎలా ఉపయోగపడుతుందో ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అదేవిధంగా ఐటీ విభాగం విద్యార్థులు చల్లవానిపేటలోని కంప్యూటర్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, నెట్‌వర్కింగ్ తదితర సాంకేతిక అంశాలపై ప్రత్యక్ష అవగాహన పొందారు. పాఠ్యాంశాల్లో నేర్చుకున్న అంశాలను వాస్తవ పరిస్థితులతో అనుసంధానించుకోవడానికి ఈ సందర్శన ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థులు తెలిపారు. పరిశ్రమలు, కార్యాలయాల్లోని వాస్తవ పని విధానాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో ప్రాయోగిక జ్ఞానం, సమస్య పరిష్కార సామర్థ్యం, సాంకేతిక నైపుణ్యాలు, వృత్తిపరమైన అవగాహన మరింత అభివృద్ధి చెందుతాయని పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ తెలిపారు. ఇలాంటి పారిశ్రామిక సందర్శనలు విద్యార్థుల భవిష్యత్ ఉపాధి అవకాశాలకు కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ పారిశ్రామిక సందర్శన కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయులు ధర్మాన రాజేశ్వరి, కె. సింహాచలం విద్యార్థులను వెంట తీసుకెళ్లి, మార్గదర్శకత్వం అందించారు.

## చిన్నమ్మడు హత్య కేసులో

# ఐదుగురికి రిమాండ్

**- నిందితులను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు**

**- 15 రోజుల రిమాండ్ విధించిన న్యాయమూర్తి**

**- అంపోలులోని జిల్లా జైలుకు తరలింపు**

**నరసన్నపేట, ఆగస్టు 27 (వార్త):** నరసన్నపేటలో చోటుచేసుకున్న చింత చిన్నమ్మడు హత్య కేసులో ఐదుగురు నిందితులను అంపోలులోని జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. కేసుకు సంబంధించి పోలీసుల అదుపులో ఉన్న నిందితులను గురువారం ఉదయం కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న బెండి అచ్యుతరావు, కింతలి ధనలక్ష్మి, కింతలి గణేశ్, బెండి లక్ష్మీనారాయణ, కింతలి మణికంఠలను న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎస్. వాణి ఐదుగురు నిందితులకు 15 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితులను భద్రతా ఏర్పాట్ల మధ్య అంపోలులోని జిల్లా జైలుకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. హత్య కేసుకు సంబంధించి తదుపరి విచారణ కొనసాగుతోందని తెలిపారు.



## దొంగతనం కేసులో

# ముద్దాయికి జైలుశిక్ష, జరిమానా

**మందస, ఆగస్టు 27(వార్త):** దొంగతనం కేసులో ముద్దాయికి జైలు శిక్ష, జరిమానా విధించబడిందని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ చెప్పారు. ఆయన గురువారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. తేది.27.08.2026 నాటి నేర నిర్ధారణ వివరాల ప్రకారం మందస పోలీస్ స్టేషన్ బి.ఎన్.ఎస్ సెక్షన్ 331(3), 305 (ఎ) కింద జతీ.చీశీ.41/2026 నేరం జరిగిన తేదీ.13-03-2026న ఉదయం 9గంటల నుండి సాయంత్రం 6గంటల మధ్య జరిగింది. మందస మండలంలోని హరిపురం గ్రామంలోని పెద్దవీధికి చెందిన పొట్టి సంతి ఇంటిలో దొంగతనం జరిగింది. ఒడిశాలోని గజపతి జిల్లా గురండి పోలీసు స్టేషన్ పరిధిలోని బాగుసోలా పోస్టు, బడగాం గ్రామానికి చెందిన ఉమాకాంత్ బిస్వాల్ అలియాస్ శంకర్ బిస్వాల్ నిందితుడు. ఉమాకాంత్ బిస్వాల్ సంతి ఇంటి లోపల ప్రవేశించి, ఒక బంగారు గొలుసు, బరువు సుమారు ఒక తులం, ఒక జత చెవి బుట్టలు(శంకరాభరణాలు నమూనా) సుమారు 1/2 తులా, ఒక జత చెవి పోగులు 1/2 తులం అపహరించాడు. మొత్తం బరువు సుమారు 2 తులాలు, విలువ రూ.1,40,000/-



పొట్టి శాంతి ఫిర్యాదు మేరకు తేది.15-03-2026న మందస ఎస్.ఐ.కె.కృష్ణప్రసాద్ కేసు నమోదు చేసి కేవలం 8 రోజుల్లో కేసు దర్యాప్తు చేసి, సరైన సాక్షాలు సేకరించి, ముద్దాయిని అరెస్ట్ చేసి, కోర్టుకి పంపించి, అతనిపై చార్జ్ షీట్ దాఖలు చేయగా, ఈ కేసును ప్రాసిక్యూషన్ తరుపున, అసిస్టెంట్ పీపీ ఎస్.నరేష్, ఇన్చార్జి ఏపీపీ రమేష్ సమర్ధవంతంగా కోర్టులో వాదనలు వినిపించగా, పై ముద్దాయిపై నేరం నిరూపణ అయినందున ముద్దాయి అయిన ఉమాకాంత్ బిశ్వాల్ ఏ శంకర్ బిస్వాల్ కు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించడం జరిగింది. జరిమానా కట్టలేని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష విదిస్తూ గురువారం జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు సోంపేట జడ్జి కంచి శ్రీనివాసరావు తీర్పు చెప్పారని ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**- పెద్దగుజ్జివాడ గ్రామ సమీపంలో ఘోర ప్రమాదం**

**- సంగంవలసకు చెందిన సుబ్బారావు మృతి**

**- ప్రమాదంలో నాగరాజుకు తీవ్ర గాయాలు**



**సారవకోట, ఆగస్టు 27 (వార్త):** సారవకోట మండలం పెద్దగుజ్జివాడ గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సంగంవలస గ్రామానికి చెందిన యువకుడు సుబ్బారావు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆయనతో కలిసి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం ప్రకారం, సుబ్బారావు, నాగరాజు ద్విచక్ర వాహనంపై పాతపట్నం మండలం తెంబూరు నుంచి పెద్దలంబ వైపు ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో పెద్దగుజ్జివాడ గ్రామ సమీపానికి చేరుకున్న సమయంలో ఎదురుగా వస్తున్న వాహనం వారి బైక్‌ను ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు సుబ్బారావు తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు తెలిసింది. ప్రమాదంలో నాగరాజు తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణాలు, ఢీకొన్న వాహనం వివరాలు, ఇతర అంశాలపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# ఇంటింటికి తెలుగుదేశం



**ఇచ్ఛాపురం, ఆగస్టు 27 (వార్త):** టి.రంపురం బూత్ 24,25, లలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. పి ఏ సి ఎస్ అధ్యక్షులు పేదిని బాబ్జి, మండల పార్టీ అధ్యక్షులు లోపింటి పద్మనాభం ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. తులసిగాం లో మిత్తన బైరాగి ఆధ్వర్యంలో జరిగిన మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీ రావు, నాటక పరిషత్ డైరెక్టర్ కామేశ్వరరావు పాల్గొన్నారు.



# పలు కుటుంబాలను కలిసిన మాజీ మంత్రి సీదిరి

**మందస, ఆగస్టు 27(వార్త):** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పలు కుటుంబాలను గురువారం కలిశారు. మందస పట్టణానికి చెందిన మోణంగి తాతారావు ఇటీవల మరణించారు. తాతారావు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. తాతారావు కుమారులు చంద్రశేఖర్, నాగేశ్వరరావు, హేమ, మధుబాబులకు సానుభూతి తెలిపారు. తాతారావు మంచి వ్యక్తి అని, ఆయన ఉద్యోగంలో కూడా మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. తాతారావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అంతకు ముందు మాజీ మంత్రి అప్పలరాజు బరాటం జయప్రకాశ్ ను పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో జయప్రకాశ్ గాయపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మందస పట్టణ అధ్యక్షునిగా పని చేసిన జయప్రకాశ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముందుగా మందస మండలంలోని రాధాకృష్ణపురం గ్రామానికి చెందిన పొందూరు రంగారావు ఇంటికి వెళ్లారు. రంగారావు కుమారుడైన పొందూరు మన్మథరావు కుమారుడు జగదీష్ వివాహ సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు సేనాపతి కిషోర్ కుమార్, ఎంపీటీసీ కంచి బెహరా, మడియా రామకృష్ణ, పితాంబరం, మద్దిల రామారావు, దువ్వ జగదీష్, సుగ్గ కోటి, మట్ట బెనర్జీ, తురక గణపతి, మట్ట రాజు, బంగారు చిన్న, రాజారావు, గణేష్, ఎండ మణి, మట్ట జగదీష్, శరత్ కుమార్, మురపాల నారాయణరావు, గుసిరి తాతయ్య, వల్లభ చంద్రశేఖర్, వల్లభ అశోక్ తదితరులు పాల్గొన్నారు.





## న్యాయవాదుల

# విధుల బహిష్కరణ

**సోంపేట, ఆగస్టు 27 (వార్త):** న్యాయవాదుల రక్షణ కోసం సోంపేట బార్ అసోసియేషన్ సభ్యులు గురు, శుక్రవారాల్లో విధులను బహిష్కరించారు. ఈ మేరకు సోంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుణితి వెంకట రావు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాదులకు రక్షణ కరువైన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సంఘటనలు దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇటువంటి సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లాలన్న ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తున్నట్టు తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమైన చోట్ల పోటీకి సిద్ధం

**- ఎన్డీఏ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**- ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు**

**నరసన్నపేట, ఆగస్టు 27 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి బలమైన పట్టు ఉన్న ప్రాంతాల్లో పార్టీ అభ్యర్థులను పోటీలో నిలబెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు తెలిపారు. ప్రజల మద్దతుతో స్థానిక సంస్థల్లో బీజేపీ ప్రాతినిధ్యాన్ని మరింత విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు చేరువ కావాలని సూచించారు. దేశ ప్రగతికి ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రజలు ఆదరణ అందించాలని కోరారు. నూతన కార్యాలయం ద్వారా నియోజకవర్గంలోని పార్టీ కార్యక్రమాలను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. స్థానిక సమస్యలపై స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేలా పార్టీ కార్యకలాపాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడి వేణుగోపాల్, పార్టీ కార్యవర్గ సభ్యుడు పోకతోట సింహాచలం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546